# లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ – ఒక లోతైన పరిశీలన

లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ అనేది లేజర్ సోర్స్‌ను ఉపయోగించి కళ్ళల్లోని కార్నియా వొంపును సరిదిద్దడం ద్వారా రోగికి కళ్ళద్దాల అవసరం లేకుండా సహాయపడే ఓ ప్రక్రియ. ఈ శస్త్రచికిత్సను సాధారణంగా మైయోపియా (హ్రస్వ దృష్టి), హైపర్‌మెట్రోపియా (దూర దృష్టి లోపం), ఆస్టిగ్మాటిజం (వక్రదృష్టి)లను సరిచేయడానికి చేయబడుతుంది. ఈ క్రింది ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న రోగులలో ఈ చికిత్స సురక్షితమైనదిగానూ, ప్రభావవంతమైనదిగానూ నిరూపించబడింది:

- రోగి వయస్సు కనీసం 21 సంవత్సరాలు అయివుండాలి
- కనీసం ఒక సంవత్సరం పాటు స్థిరమైన దృష్టిని కలిగివుండాలి
- అపవర్తన దోషం అతితక్కువగానూ, మితంగానూ ఉండాలి
- రోగి కళ్ళు మంచి మందంగల కార్నియాలను కలిగివుండాలి
- నీటికాసులు, కెరాటోకోనస్ లేదా కంటిశుక్లంలాంటి ఇతర కంటి వ్యాధులు ఉండకూడదు,

లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ ద్వారా 20/25 లేదా అంతకంటే మెరుగైన (కళ్ళద్దాలు లేకుండా డ్రైవింగ్ చేయగలిగేంత స్పష్టంగా చూడగలిగే) దృష్టిని పొందడం, అద్దాలపై ఆధారపడటాన్ని తగ్గించడం, చూపును త్వరిత గతిలో తిరిగి పొందడం, ఇలా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.

లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీలు అనేక రకాలుగా ఉన్నాయి. మీ కంటి నిర్దిష్ట అవసరాల ఆధారంగా నేత్ర వైద్యులు, వీటిలో మీకు ఉత్తమమైనదాన్ని సూచిస్తారు.

**లేసిక్ (లేజర్-అసిస్టెడ్ ఇన్ సిటు కెరాటోమిలేసిస్):** ఈ శస్త్రచికిత్సలో ముందుగా కార్నియాలో ఒక ఫ్లాప్‌ను సృష్టించడం జరుగుతుంది, దానిని పక్కకు జరిపి, కింద ఉన్న కార్నియల్ టిష్యూ వొంపును లేజర్‌తో సరిదిద్దడం జరుగుతుంది. ఆ తర్వాత ఫ్లాప్‌ను తిరిగి అదే స్థానంలో ఉంచడం జరుగుతుంది. అతితక్కువ అసౌకర్యంతో కూడిన ఈ శస్త్రచికిత్స తర్వాత త్వరిత ఉపశమనం లభిస్తుంది.

**పిఆర్‌కె (ఫోటోరిఫ్రాక్టివ్ కెరాటెక్టమీ):** ఈ శస్త్రచికిత్స లేసిక్ మాదిరిగానే ఉన్నప్పటికీ, ఇందులో కార్నియల్ ఫ్లాప్ సృష్టించబడదు. బదులుగా, కార్నియా బయటి పొర తొలగించబడుతుంది, ఆ తర్వాత దాని కింద ఉన్న టిష్యూ వొంపును సరిదిద్దడం జరుగుతుంది.

**స్మైల్ (స్మాల్ ఇన్సిషన్ లెంటికుల్ ఎక్స్‌ట్రాక్షన్):** ఈ శస్త్రచికిత్సలో ఫ్లాప్ సృష్టించకుండా, కార్నియాలో చిన్న గాటు పెట్టి ఓ లెంటిక్యుల్ (చిన్న టిష్యూ ముక్క)ను తొలగించడం జరుగుతుంది.

ఎక్కువ రిఫ్రాక్టివ్ పవర్ ఉన్న రోగులకు, ఫేకిక్ ఇంట్రా-ఒక్యులర్ లెన్స్ లేదా క్లియర్ లెన్స్ ఎక్స్‌చేంజ్‌ను ఎంపిక చేసుకోవచ్చు.

వేరే కంటి శస్త్రచికిత్సలాగానే రిఫ్రాక్టివ్ సర్జరీలకు కూడా పొడి కళ్ళు, వెలుగు తీక్షణంగా అనిపించడము, వెలుగు మూలాల చుట్టూ కాంతివలయాలు కనిపించడము, అల్ప-సవరణ, అధిక సవరణలతో పాటు కొన్ని అరుదైన సందర్భాలలో ఇన్ఫెక్షన్‌లు తలెత్తే కొన్ని దుష్పరిణామాలను కలిగి ఉంటాయనే విషయాన్ని రోగులు

తెలుసుకోవాలి. మొత్తంమీద, మిగతా వాటి కంటే ఇవి సురక్షితమైవుండి, దీర్ఘకాలంలో ప్రభావవంతమైన ఫలితాలను అందిస్తాయి.

లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీలు కళ్ళద్దాలపై ఆధారపడటాన్ని తగ్గించి, మెరుగైన జీవితాన్ని అందిస్తాయి. ఈ ప్రక్రియలు సాధారణంగా సురక్షితమైనప్పటికీ, అది మీకు సరైన ఎంపికో కాదో అని చర్చించడం చాలా అవసరం. ప్రతి కంటి పరిస్థితి ప్రత్యేకమైనది కాబట్టి, ఉత్తమ ఫలితాలను సాధించడానికి శస్త్రచికిత్స ఎంపికకు వ్యక్తీకృత విధానం అవసరం.

## రిఫ్రాక్టివ్ సర్జరీ గురించిన కొన్ని అపోహలు:

1. **ఈ సర్జరీ నొప్పిగా ఉంటుంది**

   లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ సాధారణంగా నొప్పిలేనిది. నొప్పిని తగ్గించే చుక్కలను (అనస్థీషియా డ్రాప్స్) ఇందులో ఉపయోగించడం జరుగుతుంది. రోగులు ఎక్కువగా కొంత ఒత్తిడిని అనుభవిస్తారు తప్పితే, నొప్పి అస్సలు ఉండదు.

2. **ఈ సర్జరీ పరీక్షించని కొత్త ప్రక్రియ**

   లక్షలాది మంది సంతృప్త రోగులతో, లేసిక్ 30 సంవత్సరాలకు పైగా నిర్వహించబడుతోంది. ఈ చికిత్స ద్వారా దీర్ఘకాలిక ఫలితాలు ఎన్నో దాఖలయ్యాయి.

3. **సర్జరీ సమయంలో కన్ను కదిలితే, లేజర్ కంటిని పాడు చేస్తుంది**

   ఆధునిక లేజర్ సిస్టమ్‌లలో ఐ-ట్రాకింగ్ టెక్నాలజీ ఉంటుంది, ఇది నిజ-సమయంలో సర్దుబాటు చేస్తుంది. మీ కన్ను ఎక్కువగా కదిలితే, లేజర్ ఆగిపోతుంది, కన్ను మళ్లీ స్థిరస్థానానికి ఉచ్చేవరకు వేచి ఉంటుంది. అయినప్పటికీ, ఉత్తమ ఫలితం కోసం సర్జరీ సమయంలో మీరు కన్నును కదపకుండా నేరుగా చూడాలని సిఫారసు చేయబడుతుంది.

4. **మీరు ఇకపై ఎప్పటికీ కళ్ళద్దాలు ధరించాల్సిన అవసరం ఉండదు**

   ఈ చికిత్స ద్వారా చాలా మంది 20/25 లేదా అంతకంటే మెరుగైన దృష్టిని పొందినప్పటికీ, ఇది మీలో వృద్ధాప్యాన్ని రాకుండానో, మీ దేహంలో సహజ మార్పులు జరగకుండానో ఆపదు. అందువల్ల, అరుదైన సందర్భాలలో దూరాలను చూడటానికి కళ్ళద్దాలు అవసరం కావచ్చు, దానితోపాటు 40 ఏళ్ల వయస్సునుండి, చదవడానికి కళ్ళద్దాలు అవసరం కావచ్చు.

5. **మొదటి రోజునుండి స్పష్టమైన దృష్టి!**

   మీ కన్ను కోలుకోవడానికి, చికిత్స ప్రభావం స్థిరపడటానికి కొంత సమయం పడుతుంది. దృష్టిలో మెరుగుదల కనిపిస్తుంది, మొదటి వారం చివరికి సుమారు 95% కంటి చూపు వస్తుంది. కంటిచూపు పూర్తిగా రావడానికి సుమారు ఒక నెల సమయం పడుతుంది, ఇది మీ ఆరంభ అపవర్తన దోషంపై ఆధారపడి ఉంటుంది. మొదటి కొన్ని రోజులు దృష్టి మసకబారడమూ, తీక్షణ ప్రకాశాన్ని చూడలేకపోవడమూ జరగవచ్చు.

6. **ఈ సర్జరీని ఏ రోగికైనా చేయవచ్చు**

రోగులందరూ లేజర్ సర్జరీకి అనుకూలకరంగా ఉండరు. మీ నేత్ర వైద్యులు మీ కంటి పరిస్థితిని అంచనా వేసి, లేజర్ సర్జరీ సురక్షితమైన ఎంపికో కాదో అని ఒక్కో కేసు పరిశీలించి నిర్ణయిస్తారు.

‘‘లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీ అనేది అందరికీ ఒకే విధంగా పనికొచ్చే పరిష్కారం కాదు. ప్రతి వ్యక్తికి సరైన ప్రక్రియను నిర్ణయించడానికి కంటి పరీక్షను పూర్తిగా చేసినప్పుడు, ఇది సంతృప్తికరమైన అద్భుత ఫలితాలను అందిస్తుంది. కనుక, అనుభవజ్ఞులైన నేత్ర వైద్యులను సంప్రదించడం మర్చిపోవద్దు’’, అని కడపలోని ఎల్ విపిఇఐ, వై ఎస్ రాజశేఖరరెడ్డి క్యాంపస్‌కు చెందిన నేత్ర వైద్యురాలు డా శశిబిందు పేర్కొన్నారు.